(2) "ప్రధాన విద్యుత్ ఇన్‌స్పెక్టర్" అనగా విద్యుచ్ఛక్తి చట్టము, 2003 యొక్క 162వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద రాష్ట్ర ప్రభుత్వముచే ఆ విధంగా నియమించబడిన వ్యక్తి అని అర్థము;

(3) "సహ-ఉత్పాదన " అనగా విద్యుచ్ఛక్తితో సహ రెండు లేదా అంతకెక్కువ రూపములలో ఉపయోగకరమైన ఇంధనమును ఏకకాలంలో ఉత్పత్తి చేయు ప్రక్రియ అని అర్థము;

(4) "వినియోగదారుడు" అనగా విద్యుచ్ఛక్తి చట్టము, 2003 లేదా తత్సమయమున అమలునందున్న ఏదేని ఇతర శాసనము క్రింద ప్రజలకు విద్యుచ్ఛక్తి సరఫరా చేయు వ్యాపారములో నిమగ్నమైన లైసెన్సుదారు లేదా ప్రభుత్వము లేదా ఎవరేని ఇతర వ్యక్తిచే, ఏ వ్యక్తి వినియోగము కొరకై విద్యుచ్ఛక్తి సరఫరా చేయబడినదో ఆ వ్యక్తి అని అర్థము. మరియు ఈ పదపరిధిలో లైసెన్సుదారు, ప్రభుత్వము లేదా సందర్భానుసారముగ అట్టి ఇతర వ్యక్తి చేపట్టిన పనులతో ఏ వ్యక్తి ఆవరణలలో విద్యుత్ సరఫరా కొరకు కనెక్షన్ ఈయబడినదో అట్టి వ్యక్తి చేరియుండును;

(5) "సుంకము" అనగా 3వ పరిచ్ఛేదమును అనుసరించి ప్రభుత్వముచే నిర్ణయించబడునట్టి విద్యుచ్ఛక్తి సుంకము అని అర్థము;

(6) "విద్యుచ్ఛక్తి" అనగా సమాచార ప్రసారము మినహా ఏదేని ప్రయోజనము కొరకు లేక వాడకం కొరకు ఉత్పత్తి చేయబడిన, ప్రసారము చేయబడిన, సరఫరా చేయబడిన విద్యుత్ ఇంధనము అని అర్థము;

(7) "ప్రతివ్యక్తి" అనగా స్వంత వినియోగము కొరకు విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేయుటలో లేదా సరఫరా చేయుటలో నిమగ్నమైన లేదా సదరు రెండింటిలో నిమగ్నమైన లైసెన్సు లేని వ్యక్తి అని అర్థము;

(8) "ఉత్పాదన కంపెనీ" అనగా విద్యుత్ ఉత్పాదన కేంద్రమును స్వంతముగా కలిగిన లేక నడుపు లేక నిర్వహించు, నిగమితమొనర్చబడినదైనను, కాకున్నను ఏదేని కంపెనీ, లేక నిగమిత సంస్థ లేదా అసోసియేషను లేదా వ్యక్తుల అసోసియేషను లేదా కల్పిత న్యాయిక వ్యక్తి అని అర్థము;

(9) "ప్రభుత్వము" అనగా రాష్ట్ర ప్రభుత్వము అని అర్థము;

(10) "తనిఖీ అధికారి" అనగా 6వ పరిచ్ఛేదము క్రింద నియమించబడిన వ్యక్తి అని అర్థము;

1998లోని 30వ చట్టము

(11) "లైసెన్సు" అనగా విద్యుచ్ఛక్తి చట్టము, 2003 యొక్క 14వ పరిచ్ఛేదము క్రింద మంజూరు చేయబడిన లైసెన్సు లేదా విద్యుచ్ఛక్తి చట్టము, 2003 యొక్క 13వ పరిచ్ఛేదము క్రింద మినహాయించబడిన కంపెనీతోసహా ఎవరేని వ్యక్తి; లేదా ఆంధ్రప్రదేశ్ విద్యుచ్ఛక్తి సంస్కరణల చట్టము, 1998 యొక్క 14వ పరిచ్ఛేదము క్రింద మంజూరు చేయబడిన లైసెన్సు అని అర్థము;

(12) "లైసెన్సుదారు" అనగా,-

(i) రాష్ట్ర ప్రసారణ సంస్థలతోసహా ఇంధన ప్రసారం లేదా సరఫరా చేయుటకు విద్యుచ్ఛక్తి చట్టము, 2003 యొక్క 14వ పరిచ్ఛేదము క్రింద లైసెన్సు మంజూరు చేయబడిన వ్యక్తి లేదా విద్యుచ్ఛక్తి చట్టము, 2003 యొక్క 13వ పరిచ్ఛేదము క్రింద లైసెన్సు పొందుట నుండి మినహాయింపు పొందిన వ్యక్తి లేదా ఆంధ్రప్రదేశ్ విద్యుచ్ఛక్తి సంస్కరణల చట్టము, 1998 యొక్క 14వ పరిచ్ఛేదము క్రింద లైసెన్సు ఇవ్వబడిన వ్యక్తి అని అర్థము;

(ii) ఆంధ్రప్రదేశ్ విద్యుచ్ఛక్తి ఉత్పాదన కార్పొరేషన్ లిమిటెడు, భారతీయ కంపెనీల చట్టము, 2013 యొక్క నిబంధనలు క్రింద నిగమిత మొనర్చబడిన జాతీయ థర్మల్ విద్యుచ్ఛక్తి కార్పొరేషను లేదా ప్రభుత్వ సంస్థ లేదా సంబంధిత శాసనము యొక్క నిబంధనల క్రింద మరియు కేవలం విద్యుత్ ఉత్పాదన కొరకు స్వయంగా రాష్ట్ర ప్రభుత్వము లేదా సందర్భానుసారముగా కేంద్ర ప్రభుత్వము కలిగి ఉన్న లేదా నియంత్రణ క్రింద ఏదేని ఇతర కంపెనీ లేదా స్థాపించబడిన లేదా నిగమిత మొనర్చబడిన కార్పొరేషను; 2013లోని 18వ చట్టము

(13) "అధిసూచన" అనగా ఆంధ్రప్రదేశ్ గెజెటులో ప్రచురించబడిన అధిసూచన అని అర్థము మరియు 'అధిసూచిత' అను పదమును తదనుసారముగా అన్వయించుకొనవలెను;

(14) "ప్రాంగణములు" అనగా ఇందులో ఏదేని భూమి, కార్యాలయ భవనము లేదా కట్టడము కూడా చేరియుండును;

(15) "వ్యక్తి" అనగా ఏదేని కంపెనీ లేదా నిగమిత సంస్థ లేదా నిగమితమొనర్చబడినను, కాకున్నను వైయక్తుల యొక్క అసోసియేషన్‌తో ఎవరేని వ్యక్తి లేదా కల్పిత న్యాయిక వ్యక్తి అని అర్థము;

(16) "విహితపరచబడిన" అనగా ఈ చట్టము క్రింద ప్రభుత్వముచే చేయబడిన నియమముల ద్వారా విహితపరచబడిన అని అర్థము;

(17) "నియమములు" అనగా ఈ చట్టము క్రింద రూపొందించబడిన నియమములు అని అర్థము;

(18) "సరఫరా" అనగా లైసెన్సుదారుకు లేదా వినియోగదారుకు విద్యుత్ ఇంధన అమ్మకము అని అర్థము;

(19) "యూనిటు" అనగా కేంద్ర/రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమీషను తెలిపిన ప్రకారం విద్యుత్ ఇంధనము యొక్క ఒక కిలోవాట్ అవర్సు (కెడబ్ల్యుహెచ్) లేదా కిలోవాల్టు ఆంపియరు అవర్సు (కెవిఏహెచ్) అని అర్థము;

(20) ఈ చట్టములో ఉపయోగించబడి, అయితే నిర్వచించబడని పదములు మరియు పదబంధములకు విద్యుచ్ఛక్తి చట్టము, 2003లో వాటికి ఇవ్వబడిన అర్థములనే కలిగివుండును.

విద్యుచ్ఛక్తి వినియోగము మరియు సరఫరాపై సుంకము

3.(1) ఈ చట్టములో ఇతర విధముగా నిబంధించబడిననే తప్ప, విద్యుచ్ఛక్తిని సరఫరా చేయు ప్రతీవ్యక్తి లేదా లైసెన్సుదారు మరియు ఉత్పాదన కంపెనీ, సహ-ఉత్పాదన కంపెనీ/ ప్లాంటు, క్యాప్టివ్ ఉత్పాదన ప్లాంటుతోసహ సాంప్రదాయేతర ఇంధన ప్లాంటులు లేదా అట్టి ఇతర కంపెనీలు ప్లాంట్లు, స్వతంత్రంగా విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేయువారి మరియు సొంత ప్రయోజనములకు ఉపయోగించు లేదా సరఫరా చేయు ప్రతి వ్యక్తి లేదా ఉత్పాదన కంపెనీ, గత నెలలో సరఫరా చేసిన లేదా వినియోగించిన విద్యుచ్ఛక్తిపై, రాష్ట్ర ప్రభుత్వము అధిసూచన ద్వారా ఆయా సమయములందు నిర్ణయించినట్టి సుంకమును విహితరీతిలో ప్రభుత్వమునకు ప్రతినెల చెల్లించవలెను.

(2) లైసెన్సుదారు ఒకటికంటే ఎక్కువ లైసెన్సులను కలిగి ఉన్నపుడు, ఈ పరిచ్ఛేదము క్రింద ప్రతీ లైసెన్సు విషయములోను విడిగా సుంకమును లెక్కించి, విధించవలెను.

(3) ఈ పరిచ్ఛేదము క్రింద విద్యుత్ సుంకమును చెల్లించదగు ఒక వ్యక్తి లేదా ఒక లైసెన్సుదారు మరియు లైసెన్సుదారు కానట్టి ఇతర వ్యక్తి నిర్మాణంలో వాడకం నిమిత్తం భారత ప్రభుత్వమునకు లేదా రైల్వే యొక్క నిర్మాణం, నిర్వహణ లేదా ఆపరేషనులో వాడకం నిమిత్తము భారత రైల్వే ఆపరేటు చేయు రైల్వేలకు విద్యుచ్ఛక్తిని సరఫరా చేయునపుడు, సుంకము మొత్తం ద్వారా అట్టి సరఫరాపై విధించిన ధర, తగినంతగా విద్యుచ్ఛక్తి పరిమాణమును వినియోగించు ఇతర వాడకందార్లకు విధించిన ధర కంటే తక్కువగా ఉండవలెను.

(4) రాష్ట్ర ప్రభుత్వం అధిసూచన ద్వారా ఆయాసమయములందు ఉత్పాదన ప్లాంటు యొక్క కనిష్ట సగటు స్తోమతను నిర్దిష్టపరచవచ్చును. అందు ఉత్పత్తి అయిన విద్యుచ్ఛక్తి మరియు ఉపయోగించిన లేదా వినియోగించిన విద్యుచ్ఛక్తిని బట్టి సదరు అధిసూచనలో నిర్దిష్టపరచబడునట్టి షరతులు మరియు నిబంధనలకు లోబడి, ఉప-పరిచ్ఛేదము (1) క్రింద విధించదగు సుంకమును లెక్కించవచ్చును :

అయితే, ఈ క్రింది సందర్భములలో విద్యుచ్ఛక్తి యూనిట్లపై ఎట్టి విద్యుచ్ఛక్తి సుంకమును చెల్లించనవసరం లేదు,-

(i) భారత ప్రభుత్వ కార్పొరేషనులు, ప్రభుత్వ రంగ సంస్థలు మరియు దాని యొక్క ప్రాంగణముల నివాస ప్రయోజనముల కొరకు తప్ప, దాని యొక్క వినియోగము నిమిత్తము ఒక వ్యక్తి లేదా లైసెన్సుదారు మరియు లైసెన్సుదారు కానట్టి ప్రతి వ్యక్తి సరఫరా చేసినందుకు;

1989లోని 24వ కేంద్ర చట్టము

(ii) నివాస ప్రయోజనముల కొరకైన ప్రాంగణముల విషయంలో తప్ప, రైల్వేల చట్టము, 1989లో నిర్వచించ బడినట్లుగా రైల్వేపాలన ద్వారా వినియోగము కొరకు రైల్వేకి ఒక వ్యక్తి లేదా లైసెన్సుదారు మరియు లైసెన్సుదారు కానట్టి ప్రతీ వ్యక్తి సరఫరా చేసినదానికి;

(iii) నివాస ప్రయోజనముల కొరకైన ప్రాంగణముల విషయములో ఉపయోగించినది తప్ప, నిర్మాణము, నిర్వహణ మరియు నడుపుట వంటి వాటి నిమిత్తం విద్యుత్ సంస్థకు సంబంధించిన ప్రయోజనములకు ఒక వ్యక్తి లేదా లైసెన్సుదారు మరియు లెసెన్సుదారు కానట్టి ప్రతి వ్యక్తి వినియోగించిన దానికి;

(iv) ఉత్పాదన ప్లాంటు యొక్క ఉపక్రియలలో వినియోగించిన దానికి;

(v) 10 కిలో వాట్ల వరకు లోడు కనెక్టు చేయబడిన అన్ని వ్యవసాయిక వినియోగములకు;

(vi) ఆంధ్రప్రదేశ్ విద్యుచ్ఛక్తి ఉత్పాదన కార్పొరేషన్ లిమిటెడు (ఎ.పి.జెన్.కో) ద్వారా, ఆంధ్రప్రదేశ్ విద్యుచ్ఛక్తి సంస్కరణల చట్టము, 1998 క్రింద రూపొందించబడిన ఆంధ్రప్రదేశ్ విద్యుచ్ఛక్తి సంస్కరణ (బదిలీ పథకము) నియమములు 1999 యొక్క 2(బి)లో నిర్వచించబడిన పంపిణీ కంపెనీలకు సరఫరా చేసిన దానికి;

(vii) పై ఖండము (vi)లో నిర్దేశించబడిన పంపిణీ కంపెనీలకు జాతీయ థర్మల్ విద్యుచ్ఛక్తి కార్పొరేషను లిమిటెడ్ ద్వారా సరఫరా చేయబడిన దానికి;

(5) ఈ చట్టములో ఏమి ఉన్నప్పటికినీ, ప్రజాహితము దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వము అధిసూచన ద్వారా, అందు నిర్దిష్టపరచబడునట్టి షరతులు మరియు నిబంధనలకు లోబడి, ఉప-పరిచ్ఛేదము (1) క్రింద చెల్లించదగు విద్యుచ్ఛక్తి సుంకమును పూర్తిగా గాని లేదా అందలి భాగమును గాని చెల్లించుట నుండి లైసెన్సుదారుని లేదా ఎవరేని వ్యక్తిని శాశ్వతంగాగాని లేదా నిర్దిష్టకాలావధి పాటుగాని మినహాయించుటకు కారణములను ఏర్పరచవచ్చును.

రిజిస్ట్రీకరణ.

4. (1) స్వంత వినియోగము లేదా సరఫరా కొరకు విద్యుచ్ఛక్తి ఉత్పాదన ప్లాంటును స్థాపించిన లేదా స్థాపించుటకు ప్రతిపాదించిన ఒక వ్యక్తి లేదా లైసెన్సుదారు మరియు లైసెన్సుదారు కానట్టి ప్రతీ వ్యక్తి లేదా రాష్ట్ర ప్రభుత్వము ప్రధాన విద్యుత్ ఇన్‌స్పెక్టరు కార్యాలయములో తన పేరును రిజిష్టరు చేసుకొనవలెను మరియు అదే విధముగా ఒక ఉత్పాదన ప్లాంటును మూసివేయుటకు/పడగొట్టుటకు/కొనసాగింపును నివారించుటకు/తొలగించుటకు ప్రతిపాదించిన వారెవరైనను అదే విధముగా రిజిస్ట్రీకరణను తొలగించుకొన వచ్చును.

(2) రిజిస్ట్రీ కొరకైన దరఖాస్తును, విహితపరచబడునట్టి రీతిలోను మరియు అట్టి ప్రరూపములోను మరియు అట్టి ఫీజు చెల్లింపుపైనను దాఖలు చేయవలెను.

(3) ఈ విషయములో నియమించబడిన అధికారి దరఖాస్తును స్వీకరించిన మీదట, తాను అవసరమని భావించునట్టి విచారణ జరిపిన మీదట, అట్టి ప్లాంటు కొరకు రిజిస్ట్రీకరణ/ రిజిస్ట్రీకరణ తొలగింపు యొక్క ధృవపత్రమును దరఖాస్తుదారుకు మంజూరు చేయవలెను.

అకౌంట్ల పుస్తకములు.

5. ప్రతీ వ్యక్తి లేదా లైసెన్సుదారు మరియు లైసెన్సుదారు కానట్టి ఇతర వ్యక్తి,-

(ఎ) విహిత ప్రరూపములోను మరియు అట్టి రీతిలోను అకౌంట్ల పుస్తకములను నిర్వహించవలెను.

(బి) ఉత్పాదన చేయబడిన, వినియోగించిన మరియు సరఫరా చేసిన విద్యుచ్ఛక్తి యూనిట్లను, వాటికి సంబంధించిన విద్యుచ్ఛక్తి అకౌంట్లు పుస్తకములు, చెల్లించదగు సుంకము మొత్తములను విహితపరచబడునట్టి ప్రరూపములోను, అట్టి సమయములోను ప్రధాన విద్యుత్ ఇన్‌స్పెక్టరుకు సమర్పించవలెను :

అయితే, 4వ పరిచ్ఛేదము క్రింద తన పేరును రిజిష్టరు చేయించుకొనిన ప్రతివ్యక్తి మరియు లైసెన్సుదారు మరియు లైసెన్సుదారు కానట్టి ప్రతి వ్యక్తి, అన్ని అకౌంట్ల పుస్తకములలోను మరియు ప్రధాన విద్యుచ్ఛక్తి ఇన్‌స్పెక్టరుకు సమర్పించే రిటర్నులలోను రిజిస్ట్రీకరణ సంఖ్యను వ్రాసి ఉంచవలెను.

6. (1) 5వ పరిచ్ఛేదము క్రింద విహితపరచబడినట్లు ఉంచబడిన అకౌంట్ల పుస్తకములను మరియు ఇంధన మీటర్లను తనిఖీ చేయుటకుగాను ప్రధాన విద్యుత్ ఇన్‌స్పెక్టరు తనిఖీ అధికారులను నియమించవచ్చును. తనిఖీ చేయు అధికారి.

(2) ఈ పరిచ్ఛేదము క్రింద నియమించబడిన ప్రతి తనిఖీ అధికారి, భారత శిక్షాస్మృతి, 1860 యొక్క 21వ పరిచ్ఛేదపు అర్థములోపల ప్రభుత్వ సేవకునిగా భావించబడవలెను. 1860లోని 45వ కేంద్ర చట్టము.

7. (1) ఈ విషయములో ప్రభుత్వముచే చేయబడిన ఏవేని నియములకు లోబడి తనిఖీ అధికారి,- తనిఖీ చేయు అధికారి యొక్క అధికారములు.

(i) 4వ పరిచ్ఛేదము క్రింద విహితపరచబడునట్టి కాలావధికి మరియు అట్టి నిబంధనల క్రింద అట్టి ప్లాంటు కొరకు దరఖాస్తుదారునకు ఒక రిజిస్ట్రీకరణ ధృవపత్రమును మంజూరు చేయవలెను.

(ii) ఈ చట్టము క్రింద విధించదగు విద్యుచ్ఛక్తి సుంకపు మొత్తమును తెలుసుకొనేందుకు లేదా సరిచూచేందుకు అవసరమగునట్టి పుస్తకములు మరియు రికార్డులను తనిఖీ చేయు నిమిత్తం సమర్పించవలసినదిగా కోరవలెను.

(iii) ఈ క్రింది ప్రయోజనముల కొరకు విద్యుచ్ఛక్తి సరఫరా చేయబడుచున్నదనీ లేదా వినియోగించబడుచున్నదనీ లేదా అట్లు విశ్వసించబడిన ఏవేని ప్రాంగణములలో ప్రవేశించుటకు మరియు సోదా చేయుటకు,-

(ఎ) 5వ పరిచ్ఛేదము క్రింద ఉంచబడిన అక్కౌంట్ల పుస్తకములలో మరియు సమర్పించబడిన రిటర్నులలో ఉత్పాదన చేయబడిన వినియోగించబడిన మరియు సరఫరా చేయబడిన విద్యుచ్ఛక్తిని సరిచూచుటకు;

(బి) మీటర్ల రీడింగును పరీక్షించి మరియు సరిచూచుటకు;

(సి) విద్యుచ్ఛక్తి సుంకము విధింపునకు సంబంధించి, కోరబడిన వివరములను సరిచూచుటకు;

(iv) ఈ చట్టము యొక్క లేదా అందుచేయబడిన నియమముల యొక్క ప్రయోజనములను నెరవేర్చుటకు అవసరమగునట్టి అధికారములను వినియోగించవచ్చును మరియు అట్టి ఇతర కృత్యములను నిర్వర్తించ వచ్చును.

(2) ఉప-పరిచ్ఛేదము (1) క్రింద చేయబడిన అన్ని సోదాలను క్రిమినలు ప్రక్రియాస్మృతి, 1973 యొక్క నిబంధనల ననుసరించి చేయవలెను. 1974లోని 2వ కేంద్ర చట్టము.

8. ఇంకా చెల్లించవలసి ఉండి, ఈ చట్టము క్రింద రావలసిన ఉన్న ఏదేని విద్యుచ్ఛక్తి సుంకమును,- విద్యుచ్ఛక్తి సుంకము యొక్క వసూలు.

(ఎ) బకాయిలుగా భావించబడి, ఆయా సమయములందు ప్రభుత్వముచే విహితపరచబడు రేటు చొప్పున వడ్డీతో అట్టి విద్యుచ్ఛక్తి సుంకము చెల్లించబడవలెను; మరియు

(బి) లైసెన్సుదారుకు లేదా వ్యక్తికి లేదా ఉత్పాదన కంపెనీకి విద్యుచ్ఛక్తి సరఫరాదారుకు, పొందు వారికి, వ్యక్తికి లేదా ఉత్పాదన కంపెనీకి విద్యుచ్ఛక్తి సరఫరాను నిలిపి వేయుటకు సిఫారసు చేయుటతోపాటు ప్రభుత్వముచే చెల్లించదగు ఏదేని మొత్తము నుండి తగ్గించుట ద్వారా ఖండము (ఎ) క్రింద చెల్లించదగు ఏదేని వడ్డీతోపాటు భూమి శిస్తు బకాయిలుగా వసూలు చేయబడగి ఉండవలెను.

9. ఎవరేని వ్యక్తి లేదా లైసెన్సుదారు లేదా లైసెన్సుదారు కానట్టి ఎవరేని ఇతర వ్యక్తి ప్రభుత్వము యొక్క పూర్వ మంజూరుతో మరియు నిబంధించబడినట్టి షరతులకు లోబడి, విద్యుచ్ఛక్తి సరఫరా చేయబడుతున్న ఏవరేని వ్యక్తి లేదా వ్యక్తుల తరగతి నుండి, అట్లు సరఫరా చేయబడిన విద్యుచ్ఛక్తి విషయంలో ఒక వ్యక్తి లేదా లైసెన్సుదారుచే మరియు లైసెన్సుదారు కానట్టి ఇతర వ్యక్తి చెల్లించవలసిన విద్యుచ్ఛక్తి సుంకమును లేదా ప్రభుత్వము నిర్ణయించినట్టి అందులో ఏదేని భాగమును వసూలు చేయవచ్చును. సుంకమును తిరిగి రాబట్టుకొనుట.

**విశదీకరణ:-** 3వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (3)లో పొందుపరచబడినవే తప్ప, ఈ పరిచ్ఛేదము క్రింద ఏవరేని వ్యక్తి నుండి వసూలు చేయదగు విద్యుచ్ఛక్తి సుంకము, వ్యక్తి లేదా లైసెన్సుదారుకు మరియు ఎవరేని వ్యక్తిచే విధించబడు విద్యుచ్ఛక్తి ఛార్జీలలో భాగముగా భావించబడరాదు.

సుంకము నిర్ధారణ

10. (1) 5(బి) పరిచ్ఛేదము క్రింద సమర్పించవలసిన రిటర్నులను ఒక వ్యక్తి లేదా ఒక లైసెన్సుదారు లేదా లైసెన్సుదారు కానట్టి ఇతర వ్యక్తిచే ఏదేని కాలావధికి సంబంధించి ఎటువంటి రిటర్నును సమర్పించక పోయిన యెడల లేదా అట్టి వ్యక్తి లేదా లైసెన్సుదారు లేదా లైసెన్సుదారు కానట్టి ఇతర వ్యక్తిచే సమర్పించబడిన రిటర్నులు సరి అయినవి కావని లేదా అసంపూర్తిగా వున్నవని ప్రధాన ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టరు అభిప్రాయపడిన యెడల, మరియు మీటర్లకు సీళ్ళు వేయనపుడు లేదా వాటిని తారుమారు చేసినపుడు, తప్పుగా తిరుగుతున్న / లోపభూయిష్టమైన మీటర్లు అయినపుడు, అట్టి వ్యక్తి లేదా లైసెన్సుదారు లేదా సందర్భానుసారం లైసెన్సుదారు కానట్టి ఇతర వ్యక్తి, ఆకర్ణింపబడుటకు సబబైన అవకాశం ఇచ్చిన మీదట ప్రధాన ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టరు, ఈ చట్టము క్రింద అట్టి వ్యక్తి లేదా లైసెన్సుదారు లేదా లైసెన్సుదారు కానట్టి ఇతర వ్యక్తిచే చెల్లించ బడదగు విద్యుత్ సుంకము మొత్తాన్ని తన యొక్క పూర్తి నిర్ణయం మేరకు నిర్ధారన చేయుటకై విహితపరచబడునట్టి రీతిలో ఉపక్రమించవచ్చును.

(2) సదరు కాలావధి విషయంలో అప్పటికే చెల్లించబడిన మొత్తమునకు ఏదేని తక్కువగా ఉన్నయెడల, ఉప-పరిచ్ఛేదము (1) క్రింద కాలావధికి నిర్ధారించబడిన విద్యుత్తు సుంకము మొత్తాన్ని, ఈ విషయంలో ప్రధాన ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టరుచే జారీ చేయబడిన నోటీసులో నిర్దిష్టపరచబడునట్టి తేదీన లేదా లోపల వ్యక్తి లేదా లైసెన్సుదారు లేదా లైసెన్సుదారు కానట్టి ఇతర వ్యక్తిచే చెల్లించబడవలెను మరియు నిర్దిష్టపరచవసిన తేదీ సాధారణంగా అట్టి నోటీసు తామీలు చేయబడిన తేదీ నుండి ముప్పది దినముల కంటే తక్కువగా ఉండదారు.

కంపెనీలు/ వ్యక్తులచే అపరాధములు.

11. (1) ఈ చట్టము క్రింద శిక్షింపదగు అపరాధమును ఏదేని ఒక కంపెనీ చేసిన యెడల ఆ అపరాధము జరిగినపుడు ఆ కంపెనీ యొక్క బాధ్యత లేక ఆ కంపెనీ వ్యాపార నిర్వహణ భారమును వహించియుండిన ప్రతి వ్యక్తియు మరియు ఆ కంపెనీయు ఆ అపరాధము చేసినట్లు భావించవలెను. మరియు తదనుసారముగా చర్యలు జరుపబడి శిక్షింపబడుటకు లోను కావలెను;

అయితే, అట్టి ఎవరేని వ్యక్తి తనకు తెలియకుండా అపరాధము జరిగినదని లేక అట్టి అపరాధము జరుగుటకు నివారించుటకు తాను తగిన శ్రద్ధ అంతయు తీసుకొనినట్లు అతడు ఋజువు చేసినచో, ఈ ఉప-పరిచ్ఛేదములో నున్నదేదియు అతనిని ఏ శిక్షకు గురిచేయదు.

(2) ఉప-పరిచ్ఛేదము (1)లో ఏమున్నప్పటికినీ, ఈ చట్టము క్రింద ఏదేని అపరాధమును ఒక కంపెనీ చేసియుండి, ఆ అపరాధము ఆ కంపెనీ యొక్క ఎవరేని డైరెక్టరు, మేనేజరు, కార్యదర్శి లేక ఇతర అధికారి సమ్మతితో లేక మౌనానుకూలతతో జరిగినదని లేక ఏదేని నిర్లక్ష్యము వలన జరిగినదని రుజువైన యెడల, ఆ డైరెక్టరు, మేనేజరు, కార్యదర్శి లేక ఇతర అధికారి సమ్మతితో లేదా మౌనానుకూలతతో జరిగినదని రుజువైన యెడల, ఆ డైరెక్టరు, మేనేజరు, కార్యదర్శి లేక ఇతర అధికారి కూడా అట్టి అపరాధము చేసినట్లు భావించవలెను. మరియు తదనుసారముగా చర్యలు జరుపబడి శిక్షింప బడుటకు పాత్రుడగును.

విశదీకరణ :- ఈ పరిచ్ఛేదపు ప్రయోజనము నిమిత్తము,-

(ఎ) "కంపెనీ" అనగా ఏదేని నిగమ నికాయము అని అర్థము మరియు ఈ పదపరిధిలో వ్యక్తి, లైసెన్సుదారు, ఫర్ము, సంఘం, ట్రస్టు లేదా వ్యక్తుల ఇతర అసోసియేషను చేరియుండును; మరియు

(బి) "డైరెక్టరు"

(i) ఫర్ముకు సంబంధించి అనగా ఆ ఫర్ములోని భాగస్వామి;

(ii) ఒక సంఘము, ట్రస్టు లేదా వ్యక్తులతో కూడిన ఇతర అసోసియేషనుకు సంబంధించి డైరెక్టరు అనగా సంఘం, ట్రస్టు లేదా సందర్భానుసారం ఇరత అసోసియేషను యొక్క వ్యవహారాల నిర్వహణలో సంఘం, ట్రస్టు లేదా ఇతర అసోసియేషను నియమముల క్రింద అప్పగించబడిన వ్యక్తి అని అర్థము.

పెనాల్టీలు.

12. (1) ఎవరేని వ్యక్తి,-

(ఎ) విహితపరచబడిన రీతిలో విద్యుత్తు సుంకమును చెల్లించుటకు 3వ పరిచ్ఛేదము క్రింద పాత్రుడగును; లేదా

(బి) విద్యుత్ ఉత్పాదన కర్మాగారమును రిజిష్టరు/రిజిష్టరు చేయకుండుట, 4వ పరిచ్ఛేదము క్రింద పాత్రుడగును; లేదా

(సి) అకౌంట్ల పుస్తకాలను భద్రపరచడం లేదా రిటర్నులు సమర్పించడం, వాటిని విహితపరచిన రీతిలో భద్రపరచడం లేదా సమర్పించడంలో వైఫల్యమైనపుడు 5వ పరిచ్ఛేదము క్రింద పాత్రుడగును; లేదా

(డి) ఈ చట్టము క్రింద లేదా దాని క్రింద చేయబడిన నియమముల క్రింద తన యొక్క అధికారాలను లేదా తన యొక్క కర్తవ్యములను నిర్వహించుటలో 6వ పరిచ్ఛేదము క్రింద నియమించబడిన ఇన్‌స్పెక్టింగ్ ఆఫీసరుకు ఉద్దేశపూర్వకంగా అడ్డుతగిలినపుడు; లేదా

(ఇ) ఈ చట్టము క్రింద ఇవ్వబడిన ఏదేని ఉత్తర్వు లేదా ఆదేశమును సదరు ఉత్తర్వు లేదా ఆదేశములలో నిర్దిష్టపరచబడినట్టి సమయం లోపల పాటించుటకు విఫలమైన లేదా ఈ చట్టము యొక్క ఏవేని నిబంధనలను లేదా దాని క్రింద చేసిన ఏవేని నియమములను ఉల్లంఘించిన లేదా ఉల్లంఘనకు యత్నించిన లేదా ప్రేరేపించిన, ప్రతి అపరాధం విషయంలో యాభైవేల రూపాయల వరకు విస్తరించగల జరిమానాతోను మరియు ఉల్లంఘన వైఫల్యం కొనసాగుచున్నపుడు అట్టి మొదటి అపరాధము తర్వాత వైఫల్యం కొనసాగుతున్నపుడు ప్రతి రోజుకు ఐదు వేల రూపాయల వరకు ఉండగల జరిమానాతోను శిక్షింపబడును.

(2) ఎవరేని వ్యక్తి,-

(ఎ) విద్యుత్తును మీటర్లు లేకుండా వాడుతున్నప్పుడు;

(బి) సీలు వేసిన ఏదేని మీటరును తారుమారు చేసినప్పుడు; లేదా

(సి) ఏదేని మీటరును తప్పుగా తిరుగునట్లు చేసినప్పుడు; లేదా

(డి) లోపభూయిష్టమైన మీటరు స్థానే సరిఅయిన మీటరును అమర్చడంలో విఫలమైన యెడల;

నిర్ధారించబడిన సుంకము మొత్తము ఐదు రెట్ల వరకు ఉండగల సుంకమును 11వ పరిచ్ఛేదము క్రింద చేసిన నిర్ధారణ ప్రకారం చెల్లించవలెను.

13. (1). ఎవరేని వ్యక్తి లేదా లైసెన్సుదారు మరియు లైసెన్సుదారు కానట్టి ఇతర వ్యక్తి, అట్టి నిర్ధారణ ఉత్తర్వు తర్వాత జారీ చేయబడిన డిమాండు నోటీసు అందిన తేదీ నుండి ముప్పది దినముల లోపల లేదా ప్రభుత్వం సంతృప్తి మేరకు చూపించిన కారణములపై ప్రభుత్వం అనుమతించినట్టి తదుపరి కాలావధి లోపల విద్యుత్తు సుంకం నిర్ధారణ యొక్క ఏదేని ఉత్తర్వుపై విహితపరచబడినట్టి రీతిలో ప్రభుత్వమునకు అపీలు చేసుకొనవచ్చును. అపీలు.

అయితే, విద్యుత్తు సుంకం నిర్ధారణపై అప్పీలు ఏదియు, అపీలుదారు బకాయిపడ్డ అట్టి విద్యుత్తు సుంకమును తాను చెల్లించినాడని ప్రభుత్వం సంతృప్తిపడిననే తప్ప, స్వీకరించరాదు.

(2) ప్రభుత్వం, ఉప-పరిచ్ఛేదము (1) క్రింద ఏదేని అపీలును పరిష్కరించునపుడు,-

(ఎ) వార్షిక విద్యుత్తు సుంకం నిర్ధారణను దృఢపరచవచ్చును, మార్పు చేయవచ్చును లేదా రద్దు చేయవచ్చును;

(బి) ఆదేశించినట్టి తదుపరి విచారణ తర్వాత విద్యుత్ సుంకం నిర్ధారణను రద్దు చేయవచ్చును మరియు తాజా నిర్ధారణను చేయవలసిందిగా ప్రధాన ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టరును ఆదేశించవచ్చును.

14. (1) ఈ చట్టపు ప్రయోజనములను నెరవేర్చుటకు ప్రభుత్వం, అధిసూచన ద్వారా నియమములు చేయవచ్చును. నియమములు చేయుటకు అధికారము.

(2) ప్రత్యేకముగాను, పైన తెలియజేసిన అధికారము యొక్క వ్యాపకతకు భంగము లేకుండాను, అట్టి నియమములు ఈ క్రింది విషయముల కొరకు నిబంధించవచ్చును,-

(ఎ) 3వ పరిచ్ఛేదము క్రింద విద్యుత్తు సుంకం చెల్లింపు రేటు, సమయం మరియు రీతి;

(బి) 5వ పరిచ్ఛేదము క్రింద భద్రపరచవలసిన అకౌంట్ల పుస్తకముల ప్రరూపం మరియు రిటర్నులను సమర్పించవలసిన సమయము, ప్రరూపము మరియు సమర్పించబడు అధికారులు;

(సి) తనిఖీ అధికారుల అధికారములు మరియు కర్తవ్యములు;

(డి) ఈ చట్టములో ఏ నిబంధన లేని లేదా సరిపడినంతగా లేని నిబంధనల కొరకు మరియు ఈ చట్టము యొక్క ప్రయోజనములను అమలు పరచుట కొరకు అవసరమైన ప్రభుత్వ అభిప్రాయములో నిబంధన కొరకు ఏదేని ఇతర విషయం;

(ఇ) వారిచే చెల్లించబడిన ధర 3వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (3)లో నిర్దిష్టపరచిన పరిమితికి మించినదని తెలియవచ్చినపుడు భారత ప్రభుత్వము మరియు రైల్వేలను నిర్వహిస్తున్న భారత రైల్వేకు నిధిని వాపసు చేయడం.

(3) ఉప-పరిచ్ఛేదము (1) మరియు (2) క్రింద నియమము చేయుటలో, వాటి యొక్క నియమములను ఉల్లంఘించినపుడు ప్రతి అపరాధం విషయంలో పదివేల రూపాలయలకు మించనట్టి జరిమానాతోను మరియు ఉల్లంఘన వైఫల్యం కొనసాగుచున్నపుడు అట్టి మొదటి అపరాధం తర్వాత వైఫల్యం కొనసాగు చున్నపుడు ప్రతి రోజుకు ఐదు వందల రూపాయల వరకు ఉండగల జరిమానాతోను శిక్షింపబడుదురు.

(4) ఈ పరిచ్ఛేదము క్రింద చేసిన ప్రతి నియమమును దానిని చేసిన వెంటనే రాష్ట్ర శాసన మండలి అధివేశనము నందున్నచో ఆ అధివేశనములోను, అది అధివేశనములో లేనిచో, అవ్యవహితానంతర అధివేశనములోనూ ఉభయ సదనముల సమక్షమున మొత్తము పదునాలుగు దినముల కాలావధి పాటు ఉంచవలెను. ఆ కాలావధి ఒకే అధివేశములోగాని, రెండు అనుక్రమ అధివేశనములలోగాని చేరి ఉండవచ్చును. దానిని అట్లు ఉంచిన అధివేశనము గాని, దాని అవ్యవహితానంతర అధివేశనముగాని ముగియు లోపల ఉభయ సదనములు ఆ నియమములో ఏదైనా మార్పు చేయుటకు లేదా ఆ నియమమును రద్దు చేయుటకు అంగీకరించినచో, ఆ మార్పు లేక రద్దు ఆంధ్రప్రదేశ్ గెజెటులో అధిసూచింపబడు తేదీ నుండి ఆ నియమము అట్లు మార్పు చేయబడిన రూపంలో మాత్రమే అమలు కలిగి ఉండును లేక సందర్భానుసారముగ రద్దగును. అయినప్పటికినీ ఏదేని అట్టి మార్పుగాని, రద్దుగాని ఆ నియమము క్రింద అంతకు పూర్వం చేయబడిన దేని శాసనమాన్యతకైనను భంగము కలిగించదు.

చిక్కులను తొలగించుటకు అధికారము.

15. చట్టము యొక్క నిబంధనలను అమలుపరచుటలో ఏదేని చిక్కు ఏర్పడినచో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికారిక గెజెటులో ప్రచురించిన ఉత్తర్వు ద్వారా, ఈ చట్టపు నిబంధనలకు అసంగతము కాకుండ, ఆ చిక్కును తొలగించుటకు అవసరమని లేక ఉపయుక్తమని తోచునట్టి నిబంధనలను చేయవచ్చును.

సద్భావముతో తీసుకొన్న చర్యకు రక్షణ.

16. ఈ చట్టము క్రింద సద్భావముతో చేసిన లేదా చేయుటకు ఉద్దేశించిన ఎవరేని వ్యక్తిపై ఎట్టి దావా, అభియోగము లేదా ఇతర శాసనిక చర్య ఉండదు.

రద్దులు, వ్యావృత్తులు 1939లోని 5వ చట్టము

17. (1) ఆంధ్రప్రదేశ్ విద్యుచ్ఛక్తి సుంకము చట్టము, 1939 ఇందుమూలముగా రద్దు చేయబడినది;

అయితే రద్దు ఈ క్రింది వాటికి భంగము కలిగించదు,-

(ఎ) రద్దయిన చట్టము యొక్క పూర్వపు అమలు లేక వాటి క్రింద తగురీతిగ చేసిన, లేదా అనుభవించిన దేనినైనను;

(బి) రద్దయిన చట్టము క్రింద ఆర్జించిన, ప్రాప్తించిన, లేక కలిగిన ఏదేని హక్కు, విశేషాధికారము, బాధ్యత లేదా ఉత్తరదాయిత్వము;

(సి) రద్దయిన చట్టము క్రింద చేసిన ఏదేని అపరాధమునకు సంబంధించి విధించిన ఏదేని పెనాల్టీ కోల్పోవుట లేదా శిక్ష;

(డి) పైన తెలిపినట్లుగా ఏదేని అట్టి హక్కు విశేషాధికారము, బాధ్యత, ఉత్తరదాయిత్వము, కోల్పోవుట లేక శిక్ష విషయములో ఏదేని దర్యాప్తు న్యాయిక ప్రొసీడింగులు, (నిర్ధారణ ప్రొసీడింగులతో సహా) లేక ప్రత్యుపాయము, మరియు ఈ చట్టము చేయబడనిచో ఎట్లో అట్లే ఏదేని అట్టి దర్యాప్తు న్యాయిక ప్రొసీడింగు లేక ప్రత్యుపాయము ప్రారంభించవచ్చును, కొనసాగింపవచ్చును, లేక అమలు జరుపవచ్చును. మరియు ఏదేని అట్టి పెనాల్టీ, కోల్పోవుట లేక శిక్ష విధింపవచ్చును.

(2) అట్టి రద్దుతో నిమిత్తము లేకుండా,-

(ఎ) రద్దయిన శాసనముల క్రింద చేసిన ఏదేని నియమము, లేదా జారీ చేసిన అధిసూచన తనిఖీ ఉత్తర్వు లేదా నోటీసు లేదా ఇచ్చిన ఏవేని ఆదేశముతో సహా ఆ రద్దయిన శాసనముల క్రింద చేసిన దానిని గాని, తీసుకొనిన ఏ చర్యను గాని, చేసినట్లు ఉద్దేశించిన దేనినిగాని, ఇది ఈ చట్టము యొక్క నిబంధనలకు అసంబద్ధం కానంత వరకు, ఈ చట్టము యొక్క సంబంధిత నిబంధనల క్రింద చేసినట్లు లేక తీసుకొనినట్లు భావించవలెను;

(బి) ఈ చట్టము ప్రారంభమునకు ముందుగల కాలావధిలో రద్దయిన ఆంధ్రప్రదేశ్ విద్యుచ్ఛక్తి సుంకము చట్టము, 1939 క్రింద మరియు దానిక్రింద చేసిన నియమముల క్రింద విధించిన ఏదేని సుంకము, అయితే వసూలు చేయబడని దానిని, రద్దయిన చట్టము మరియు దాని క్రింద చేసిన నియమముల క్రింద వసూలు చేయవచ్చును.

(3) ఆంధ్రప్రదేశ్ విద్యుచ్ఛక్తి సుంకము చట్టము, 1939లోని 9వ పరిచ్ఛేదము క్రింద చేసిన అన్ని నియమములు అట్టి నియమములు రద్దగునంతవరకు లేదా సందర్భానుసారం మార్పు చేయబడునంత వరకు అమలునందుండుట కొనసాగవలెను.

18. ఈ చట్టము భారత సంవిధానములోని 288వ అనుచ్ఛేదపు నిబంధనలకు లోబడి అమలునందుండలెను. ఈ చట్టము భారత సంవిధానములోని 288వ అనుచ్ఛేదపు నిబంధనలకు లోబడి ఉండుట

## ఉద్దేశాలు కారణాలు

ఆంధ్రప్రదేశ్ విద్యుచ్ఛక్తి సుంకము చట్టము, 1939, లైసెన్సుదారు, వినియోగదారులకు చేసే అన్ని అమ్మకాలపై యూనిటు ఒక్కింటికి 6 పైసలు రేటు చొప్పునను మరియు రైల్వేలు, కేంద్ర ప్రభుత్వ సర్వీసులు మరియు వ్యవసాయ వినియోగము కొరకైనవి కాక, ఇతర ఉత్పాదన కంపెనీలు చేసే స్వంత వినియోగముపై యూనిటు ఒక్కింటికి 25 పైసలు రేటు చొప్పున విద్యుచ్ఛక్తి సుంకము విధింపునకు వీలు కలిగిస్తున్నది.

భారత దేశములో విద్యుత్ సరఫరా పరిశ్రమ "శైశవ దశలో" ఉన్నపుడు, వినియోగం మరియు విక్రయముపై విద్యుచ్ఛక్తి సుంకము విధింపు కొరకు ఆంధ్రప్రదేశ్ విద్యుచ్ఛక్తి సుంకము చట్టము, 1939 మౌలిక ప్రణాళికను ఏర్పరచింది. విద్యుత్ సంస్కరణల మూలంగాను మరియు విద్యుచ్ఛక్తి చట్టము, 2003 ద్వారా చేయబడిన విద్యుత్ శాసనములలో వచ్చిన మార్పుల దృష్ట్యాను, విద్యుచ్ఛక్తి మార్పిడి, వ్యాపారము, బహిరంగ ప్రవేశము వంటి పద్ధతులను కూడా ప్రవేశపెట్టినందుననూ లైసెన్సింగు ఉత్పాదనకు విధానమును తొలగించినందుననూ మరియు సాంప్రదాయేతర అభివృద్ధిదారులను ప్రోత్సహించడంతోపాటు క్యాప్టివ్ ఉత్పాదనను స్వేచ్ఛగా అనుమతిస్తున్నది.

విద్యుత్ రంగమునకు ఇతోధిక సహాయము సమకూర్చుటలో ప్రభుత్వ ప్రధాన సామాజిక బాధ్యత చేరి ఉన్నందుననూ మరియు లభ్యంగా ఉన్న అన్ని వనరులను సమీకరించి ఆదాయాన్ని పెంపొందించవలసిన తప్పనిసరి అవసరం ఏర్పడినందుననూ, ఆంధ్రప్రదేశ్ విద్యుచ్ఛక్తి సుంకము చట్టము, 1939ను రద్దు చేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములో విద్యుత్ సుంకము విధింపును క్రమబద్ధము చేయు శాసనమును ఏకీకరించుట ద్వారా కొత్త శాసనము చేయవలసిన అవసరము ఏర్పడినది.

ఈ బిల్లు, పై నిర్ణయమును అమలుపరచుటకు ఉద్దేశించబడినది.

నారా చంద్రబాబునాయుడు
ముఖ్యమంత్రి

## ప్రదత్త శాసన నిర్మాణమును గురించిన వివరణ.

బిల్లులోని ఖండములు 1(3), 3(1)(4)(5), 4(2)(3), 5, 7, 8, 10(1), 12, 13, 14(1) మరియు 15లలో నిర్దిష్టపరచిన విషయములకు సంబంధించి మరియు చట్టపు ప్రయోజనములకు నెరవేర్చుటకు అధిసూచనలను జారీ చేయడానికి, నియమములను చేయుటకు ప్రభుత్వమునకు ప్రాధికారము నిచ్చుచున్నవి. అట్లు జారీ చేయబడిన అన్ని అధిసూచనలు మరియు చేయబడిన నియమములు చాలా వరకు ప్రక్రియాపరమైన స్వభావము గల విషయాలకై ఉద్దేశించినవే. వాటిని రాష్ట్ర శాసనమండలి ఉభయ సదనముల సమక్షమునందు ఉంచవలెను. మరియు అవి శాసన మండలి చేయు ఏవేని మార్పులకు లోబడి ఉండును.

కాబట్టి, ప్రదత్త శాసన నిర్మాణమునకు సంబంధించిన బిల్లులోని పై నిబంధనలు సాధారణమైనవి మరియు ప్రధానంగా ప్రక్రియాపరమైన విషయముల కొరకు ఉద్దేశింపబడినవి.

నారా చంద్రబాబునాయుడు

ముఖ్యమంత్రి

**ఆంధ్రప్రదేశ్ శాసనసభ కార్యకలాప ప్రక్రియ మరియు నిర్వహణ నియమావళిలోని 95వ నియమం క్రింద వివరణ**

ఆంధ్రప్రదేశ్ విద్యుచ్ఛక్తి సుంకము బిల్లు, 2015ని రాష్ట్ర శాసనమండలి ఆమోదించిన పిమ్మట, భారత సంవిధానములోని 288వ అనుచ్ఛేదము ననుసరించి సదరు సంవిధానములోని 254(2)వ అనుచ్ఛేదము క్రింద రాష్ట్రపతి పర్యాలోచన మరియు అనుమతి నిమిత్తము, బిల్లును ప్రత్యేకించుటకు గవర్నరుకు సమర్పించవలెను.

నారా చంద్రబాబునాయుడు
ముఖ్యమంత్రి

కె. సత్యనారాయణరావు,
రాష్ట్ర శాసనమండలి కార్యదర్శి (ఇన్‌ఛార్జి)

Printed by the Commissioner of Printing, at A. P. Legislative Assembly Printing Press, Hyderabad.